**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 182 | volume: 1, Issue: 182 | శుక్రవారం 30 జనవరి 2026 పేజీలు : 8 వెల : 3.00


## వింగ్స్ ఇండియా 2026కు

### ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగం



**హైదరాబాద్:** హైదరాబాద్‌లో నిర్వహించిన వింగ్స్ ఇండియా–2026 కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఉద్దేశించి ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో భారత విమానయాన రంగం ఎలైట్ ప్రయాణ మాధ్యమం నుంచి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఎదిగిందని ప్రధాని పేర్కొన్నారు. ప్రాంతీయ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉడాన్ పథకం తదుపరి దశను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సీప్లేన్ కార్యకలాపాలను కూడా విస్తరించనున్నట్లు వెల్లడించారు. దేశీయంగా విమానాల తయారీలో భారత్ సాధించిన పురోగతిని ప్రస్తావించిన ప్రధాని, ప్రపంచ స్థాయి విమానయాన గేట్‌వేగా భారత్ ఎదుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా కూడా ప్రసంగించారు. భారత విమానయాన రంగంలో ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్య నిర్మాణం ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. వింగ్స్ ఇండియా–2026 కార్యక్రమం చివర్లో నిర్వహించిన డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది ఆవిష్కరణల ఆధారిత, భవిష్యత్‌కు సిద్ధమైన భారత విమానయాన ప్రయాణానికి ప్రతీకగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## గాలి నాణ్యతపై శాస్త్రీయ విధానంతో తెలంగాణ ముందడుగు



**హైదరాబాద్:** మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగంలో గాలి నాణ్యత సూచీ మరియు గాలి నాణ్యత నిర్వహణ అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం శాస్త్రీయ విధానంతో ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజారోగ్యం, ఉత్పాదకత, ఆర్థికాభివృద్ధితో గాలి నాణ్యతకు నేరుగా సంబంధం ఉందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 40 కొత్త గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో ప్రజలకు గాలి నాణ్యత డాష్‌బోర్డులు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. దీనివల్ల ప్రజలు తమ ప్రాంతంలోని గాలి నాణ్యతపై అవగాహన పొందగలుగుతారని అన్నారు. స్వచ్ఛమైన రవాణా, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ప్రజా రవాణా బలోపేతం, పరిశ్రమల ఉద్గారాలపై కఠిన పర్యవేక్షణ, పునరుత్పాదక శక్తి వినియోగంతో ఆరోగ్యవంతమైన, సుస్థిర తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## మేడారం జాతరలో అత్యంత కీలక ఘట్టం

- వనం వీడి జనంలోకి సమ్మక్క తల్లి ఆగమనం...
- ఎస్పీ కేకన్ కాల్పులు, పోలీసుల గౌరవవందనం...
- గద్దెలపై కొలువుదీరిన శ్రీ సమ్మక్క–సారలమ్మ...



**మేడారం, జనవరి 29:** మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతరలో అత్యంత కీలక ఘట్టం రానే వచ్చింది. వనం, చిలకలగుట్టను వీడి జనంలోకి సమ్మక్క తల్లి ఆగమనం ప్రారంభమైంది. ఈ పవిత్ర ఘట్టాన్ని వీక్షించేందుకు లక్షలాది భక్తులు మేడారం తరలివచ్చారు. అడవుల మధ్య నుంచి భక్తుల మధ్యకు సమ్మక్క తల్లి ప్రయాణం ప్రారంభమవడంతో జాతర ప్రాంగణం భక్తిశ్రద్ధలతో మార్మోగింది. సమ్మక్క తల్లికి గౌరవసూచకంగా గాల్లోకి ఎస్పీ రాంనాథ్ కేకన్ కాల్పులు జరిపారు. అనంతరం పోలీసులు సమ్మక్క తల్లికి గౌరవవందనం సమర్పించారు. సాంప్రదాయబద్ధంగా సాగిన ఈ ఘట్టం భక్తుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. జాతరలో పోలీస్



యంత్రాంగం సమ్మక్క తల్లికి ఇచ్చిన గౌరవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రుల ఘనస్వాగతం, భక్తుల జయజయధ్వానాలు సమ్మక్క తల్లి ఆగమనానికి మంత్రులు సీతక్క, అద్లూరి లక్ష్మణ్ ఘనస్వాగతం పలికారు. భక్తులు 'సమ్మక్క జై' అంటూ నినాదాలు చేస్తూ అమ్మవారిని భక్తిపూర్వకంగా ఆహ్వానించారు. చుట్టూ మార్మోగిన జయజయధ్వానాలు మేడారం అడవులను దద్దరిల్లించాయి. ఈ దృశ్యాలు భక్తుల మనసులను కదిలించాయి. భక్తుల అపూర్వ ఉత్సాహం నడుమ సమ్మక్క తల్లి గద్దెలపైన కొలువుదీరింది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై కొలువుదీరగా, ఇప్పుడు సమ్మక్క తల్లి రాకతో జాతర పూర్తిస్థాయిలో పరిపూర్ణతను సాధించింది. మేడారం జాతరలో ఈ ఘట్టం అత్యంత పవిత్రమైన క్షణంగా భక్తులు భావిస్తున్నారు. శ్రీసమ్మక్క–సారలమ్మలను అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

## మేడారం మహాజాతరలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం



**మేడారం:** పచ్చని అరణ్యాల నడుమ వెలసిన ఆధ్యాత్మిక శక్తి మేడారం మరోసారి భక్తులతో కళకళలాడింది. శ్రీసమ్మక్క–సారలమ్మ మేడారం మహాజాతర సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈరోజు ఉదయాన్నే కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క–సారలమ్మ గద్దెలతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా పూజారులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవార్ల దర్శనం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఈ పవిత్ర మహాజాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ విశేష జాతర భక్తి భావాన్ని, సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తోందని తెలిపారు. ఈ పవిత్ర సందర్భంలో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆరోగ్యం, ఆనందం కలగాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సమృద్ధిగా, శాంతియుతంగా వర్ధిల్లాలని సమ్మక్క సారలమ్మలను మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.

## కాంగ్రెస్‌లో శశిథరూర్ వ్యవహారం హైకమాండ్‌తో కీలక భేటీ



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఇటీవలి కాలంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసిస్తూ శశిథరూర్ పలుమార్లు స్పందించడంతో కాంగ్రెస్‌తో ఆయన సంబంధాలు మరింత బలహీనపడ్డాయని చర్చ సాగుతోంది. పార్టీ అధికారిక వైఖరికి భిన్నంగా ఆయన వ్యాఖ్యలు చేయడం అసంతృప్తికి కారణమైంది. బీజేపీ చేరిక ప్రచారానికి బలం ఈ పరిణామాల నేపథ్యంలో శశిథరూర్ బీజేపీలో చేరబోతున్నారనే ప్రచారం ఇటీవలి కాలంలో మరింత ఊపందుకుంది. మరోవైపు కాంగ్రెస్ కీలక సమావేశాలకు ఆయన వరుసగా గైర్హాజరు కావడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. పార్టీ శ్రేణుల్లోనే కాకుండా జాతీయ రాజకీయాల్లోనూ ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. పార్లమెంటులో కీలక భేటీ ఈ క్రమంలోనే బుధవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో శశిథరూర్ పార్లమెంటు ప్రాంగణంలో భేటీ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు ఈ సమావేశం కొనసాగినట్టు సమాచారం. తాజా రాజకీయ పరిణామాలు, పార్టీపై వస్తున్న ప్రచారాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. డ్యామేజ్ కంట్రోల్ ప్రయత్నమా? పార్టీకి కలుగుతున్న నష్టాన్ని తగ్గించే డ్యామేజ్ కంట్రోల్‌లో భాగంగానే ఈ సమావేశం జరిగినట్టు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తన వైపు నుంచి వివరణ ఇచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్‌ను కలిసేందుకు శశిథరూర్ సమయం కోరినట్టుగా చెబుతున్నారు. ఈ భేటీ తర్వాత అయినా కాంగ్రెస్–శశిథరూర్ మధ్య సంబంధాల్లో స్పష్టత వస్తుందా? లేక ప్రచారాలు కొనసాగుతాయా? అన్నది వేచి చూడాల్సిందే.

## గర్భిణీ మహిళా కమాండో హత్య: భర్త అరెస్ట్



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని న్యూఢిల్లీలో గర్భిణీ మహిళా కమాండో హత్యకు గురైన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఢిల్లీ పోలీస్ శాఖలో స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ బృందంలో మహిళా కమాండోగా పనిచేస్తున్న 27 ఏళ్ల కాజల్ చౌదరిని ఆమె భర్త అంకుర్ దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. డంబెల్‌తో తలపై పలుమార్లు కొట్టడంతో తీవ్రంగా గాయపడిన కాజల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాజల్ 2022లో ఢిల్లీ పోలీస్ శాఖలో ఉద్యోగంలో చేరింది. ప్రస్తుతం స్వాట్ బృందంలో మహిళా కమాండోగా విధులు నిర్వహిస్తోంది. తీవ్ర గాయాల కారణంగా కాజల్ జనవరి 27న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటనపై ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అదనపు కట్నం కోసం కాజల్‌ను వేధించారని ఆరోపించాడు. పోలీసులు అంకుర్‌పై హత్య కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.

## బారామతిలో అజిత్ పవార్ అంత్యక్రియలు



**బారామతి:** అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. బుధవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి భారీగా జనసందోహం తరలివచ్చింది. రాష్ట్ర గౌరవ సూచకంగా అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి. – రాజకీయ ప్రముఖుల హాజరు ఈ అంత్యక్రియలకు కేంద్ర, రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. – కన్నీటి వీడ్కోలు పలికిన కార్యకర్తలు అజిత్ పవార్‌ను కడసారి చూసేందుకు ఎన్సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. తమ నాయకుడి మృతితో వారు తీవ్రంగా భావోద్వేగానికి లోనయ్యారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం మరింత విషాదాన్ని మిగిల్చింది. అజిత్ పవార్‌కు భార్య సునేత్ర పవార్, కుమారులు పార్థ్, జే ఉన్నారు.

## 20వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిగా కుమ్మరి శంకర్ నామినేషన్ దాఖలు....



**వేములవాడ జనవరి 29 (మన వార్త)**వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 20వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కుమ్మరి శంకర్ గురువారం అధికారికంగా తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వార్డులో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన స్థానిక ప్రజలు ఆయనకు నీరాజనాలు పలుకుతూ ఘన స్వాగతం తెలిపారు. అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్న కుమ్మరి శంకర్ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటానని భరోసా ఇస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. మంచి తనానికి మారు పేరుగా నిలిచే శంకర్ సౌమ్యుడిగా పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రశ్నించే గొంతుకగా ఆయనకు ప్రజల్లో విశేషమైన ఆదరణ,అభిమానం ఉంది. ముఖ్యంగా యువతరం మొత్తం ఆయన నాయకత్వం కోరుకోవడంతో 20వ వార్డు ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వార్డులో తాగునీరు,రహదారులు,పారిశుద్ధ్యం,విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ముఖ్య అజెండా అని ఆయన స్పష్టం చేస్తున్నారు. నామినేషన్ అనంతరం ప్రారంభమైన ప్రచారంలో ఆయనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గతంలో ఆయన చేసిన సేవలు,ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండే నాయకుడు కావడం,మంచి వ్యక్తిత్వం,ఆపదలో కొండంత అండగా నిలిచే నైజం వంటివి ఆయన గెలుపుకు కలిసి వస్తున్నాయి. వార్డులో అన్ని వర్గాల ప్రజలు ఆయనకు మద్దతు ప్రకటిస్తూ విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే కుమ్మరి శంకర్‌కు విజయావకాశాలు అధికంగా కనిపిస్తున్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రజల ఆశీస్సులతో 20వ వార్డు అభివృద్ధికి కొత్త దిశ చూపుతానన్న నమ్మకంతో ఆయన ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు.

## హ్యాపీ బర్త్ డే బాస్ అంటూ అభిమానుల ప్రేమలో తడిసిన శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు




**శేరిలింగంపల్లి, జనవరి 29,(మన వార్త ప్రతినిధి)**హ్యాపీ బర్త్ డే బాస్ అంటూ అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషుల నినాదాలతో శ్రీకాంత్ రెడ్డి, జన్మదిన వేడుకలు ఆత్మీయంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, సన్నిహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్నేహంతో మమేకమై, కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచే మిత్రుడిగా శ్రీకాంత్ రెడ్డి, సంపాదించుకున్న ఆదరణ ఈ వేడుకల్లో స్పష్టంగా కనిపించింది. అభిమానుల ప్రేమ, మిత్రుల ఆత్మీయత, శ్రేయోభిలాషుల ఆశీస్సులు ఆయనకు మరింత బలంగా నిలిచాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, స్నేహితుల పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధత, సహృదయత భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కేక్ కట్ చేసి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలుపుతూ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది..

## మత్స్యగిరీంద్ర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**శంకరపట్నం:జనవరి29(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి కళ్యాణ మహోత్సవానికి గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి మంగళ శాసనాలు,ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ,,నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఆరోగ్యకరమైన జీవనం గడపాలని,సంపదలతో ప్రజలే కాకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ స్వామి వారిని వేడుకున్నట్టు తెలిపారు. ఈ మహోత్సవానికి ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దడమే కాకుండా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించిన పాలకవర్గాన్ని ఆయన అభినందించారు. ఈ మహోత్సవంలో టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్,ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరెం రాజిరెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి,టెంపుల్ మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచ్ లు జిల్లా నాయకులు,మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్కసారలమ్మ దర్శించుకున్న మార్కెట్ చైర్మన్ కమిటీ సుకినే సంతాజీ



**ఎల్కతుర్తి జనవరి 29 మన వార్త ప్రతినిధి**ఆదివాసీల ఆరాధ్యదైవాలైన వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించిన ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుఖినే సంతాజి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో గురువారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సంతాజి మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలంతా వనదేవతల ఆశీర్వాదాలతో చల్లగా సుఖసంతోషాలతో ఉండాలని వనదేవతల కృపతో ప్రజల జీవితాల్లో శాంతి సుభిక్షత సమృద్ధి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ముప్పు మహేందర్ ముల్కనూర్ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి ఆదరి రవీందర్ గాంధీనగర్ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి బావుపేట బత్తిని రవీందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు హింగే శ్రీకాంత్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

## వన దేవతలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



**బెజ్జంకి, జనవరి 29(మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి,గుండారం గ్రామాల్లోని వన దేవతలు అయిన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఆహ్వానానికి విచ్చేసినమాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కి ఆలయ చైర్మన్,ఆలయ పూజారి ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ వన దేవతలను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని,కోరిన కోరికలు తీర్చే సమ్మక్క సారలమ్మలకు ఎత్తు బంగారాన్ని సమర్పించి, మొక్కలు చెల్లించుకొని అమ్మ వార్ల దీవెనలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

## బొగ్గుల అరుణకుమారి చిత్రపటానికి నివాళ్లు అర్పించిన బీఆర్ఎస్ నేతలు



**–అరుణ కుమారి దశదిన కార్యక్రమం లో పాల్గొన్న మాజీ ఎంపీ నామ,ఎంఎల్సీ తాతా మధు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు....**

**మధిర, జనవరి29( మన వార్త):**బిఆర్ ఎస్ మధిర మండల ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి మాతృమూర్తి జాలిముడి మాజీ సర్పంచ్ బొగ్గుల అరుణ్ కుమారి ఇటీవల మృతి చెందారు. గురువారం జాలముడి గ్రామంలో అరుణకుమారి సంతాప సభ జరిగింది. జరిగిన సంతాప సభకు హాజరైన బి ఆర్ ఎస్ పార్టీ మాజీ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు,ఎంఎల్సీ ,బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు నేతలు అరుణకుమారి చిత్రపటానికి పువ్వులు చల్లి నివాళు లర్పించారు. అనంతరం బొగ్గుల భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మధిర మండల పార్టీ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు,బి ఆర్ ఎస్ నేతలు బిక్కి కృష్ణ ప్రసాద్,చిత్తారు నాగేశ్వరరావు,రంగిశెట్టి కోటేశ్వరరావు, మోరంపూడి ప్రసాద్, ముత్యాల వెంకట అప్పారావు,చావా వేణు, గ్రామ సర్పంచ్ శీలం కోటేశ్వరి, వంకాయలపాటి నాగేశ్వరరావు,ముత్తవరపు ప్యారీ,కూన నరేందర్ రెడ్డి, అబ్బూరి రామన్,తాళ్లూరి హరీష్ బాబు,దిల్ కుమార్,శీలం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కళలకి పుట్టినిల్లు మధిర



**–మధిర ప్రధాన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పాగి బాలస్వామి....**

**మధిర, జనవరి29( మన వార్త)**కళలకు పుట్టినిల్లు మధిర అని మధిర ప్రధాన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పాగి బాలస్వామి అన్నారు. మధిర బంజారా కాలనీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో గురువారం మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షులు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో తెలుగు రెండు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ఏకపాత్రాభినయం,పౌరాణిక నాటికల సన్నివేశ పోటీల్లో పాల్గొన్న కళాకారులకు ఆయన మెమొంటో ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాగి బాలస్వామి మాట్లాడుతూ, అనేకమంది మధిర ప్రాంత కళాకారులు తన నటన ద్వారా జాతీయస్థాయిలో అనేక అవార్డులను పొంది మధిరకి దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్టలు తెచ్చారని ఆయన తెలిపారు. కళామతల్లి ముద్దుబిడ్డలైన మధిర కళాకారులు దేశవ్యాప్తంగా అనేక నాటక ప్రదర్శనలు చేసి బహుమతులు పొందాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కళలను ఆదరించేందుకు మాటూరు పేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపకులు గడ్డం సుబ్బారావు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అనంతరం తెలుగు రెండు రాష్ట్రాలకు చెందిన అనేకమంది కళాకారులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం,నాటక సన్నివేశాలు రక్తి కట్టించాయి. పౌరాణిక నాటక సన్నివేశాలు వచ్చినప్పుడు ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఏంటిది రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాల శ్రీ కృష్ణ ప్రసాద్ గడ్డం రమేష్ సీనియర్ జర్నలిస్టు పసుపులేటి శ్రీనివాసరావు శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రాగట్ల పల్లె గ్రామపంచాయితీ. కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం




**మన వార్త ఎల్లారెడ్డిపేట ప్రతినిధి జనవరి 29 :** ఓమౌజయ శ్రీశ్రీశ్రీ పరమ పూజ్య మహ ప్రేమవతార ములాధిపర స్వయంభూ ఆది పరబ్రహ్మ జై మహావిభో శ్రీ వారి దివ్య ఆశీస్సులతో గురువారం ఎల్లారెడ్డి పేట ముడలం రాగట్ల పల్లె గ్రామపంచాయితీ. కార్యాలయంలో ఉదయం 8:00 నుండి 1:00వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినారు, హైదరాబాద్ కు చెందిన డా. లక్ష్మీకాంతం వైద్య పరీక్షలు నిర్వహించినారు 120,మందికి ఉచితంగా మందులు పంపిణీ చేసినారు. సర్పంచు లస్మయ్య వార్డు మెంబర్లు ఓమౌజయా ప్రజ్ఞాన క్షేత్రం నుండి పరార్తోమౌజయులు సిద్ధ భక్తోమౌజయులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేయటం సరికాదు



**–బిఆర్ఎస్ బెజ్జంకి మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి....**

**బెజ్జంకి, జనవరి 29(మన వార్త ప్రతినిధి)**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి సిట్ నోటీసులు జారీ సరికాదని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదని భారత రాష్ట్ర సమితి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల అధ్యక్షుల పాకాల మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజల కోసం ప్రాణాలు పణంగా పెట్టి ఉద్యమం చేసిన నాయకుడిపై చర్యలు తగవని,తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి , ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నాయకుడు కేసీఆర్ అని, కాళేశ్వర జలాలతో లక్షల ఎకరాల భూమిని సస్యశ్యామలం చేసినందుకు, రైతు బంధు, రైతు బీమా ఇచ్చిన నాయకునిపై ,వ్యవసాయాన్ని పండగల మార్చిన కేసీఆర్ పై సిట్ నోటీసులు తగవని, కాంగ్రెస్ ప్రభుత్వ దుర్వినియోగానికి పరాకాష్ట అని కేసీఆర్ గారిని టచ్ చేస్తే తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లే అని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్ ది అని గుర్తుచేశారు.

# వేసవి నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



**–ఎల్లారెడ్డిపేట మండలంలో సమన్వయ సమావేశం...**

**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జనవరి 29 :** రాజన్న సిరిసిల్ల జిల్లా గౌరవ కలెక్టర్ గారి ఆదేశాల మేరకు, రాబోయే వేసవికాలంలో గ్రామ పంచాయతీల లో మంచినీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఎల్లారెడ్డిపేట మండలంలో కీలక సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఎల్లారెడ్డిపేటలో నిర్వహించబడగా,గౌరవ ఎంపీడీవో జీ. సత్తయ్య,సిరిసిల్ల డివిజన్ మిషన్ భగీరథ ఇంట్రా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పావని ,సిరిసిల్ల గ్రిడ్ డివిజన్ మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము ,మండల పంచాయతీ అధికారి జోగం రాజు ,మిషన్ భగీరథ సహాయక ఇంజనీర్ సంతోష్ 26, గ్రామ పంచాయతీల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు మిషన్ భగీరథ పంపు డ్రైవర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, తేదీ 01.02.2026 నుండి 20.02.2026 వరకు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఎం. పి. ఓ & మిషన్ భగీరథసహాయఇంజనీరులు,పంచాయతీ కార్యదర్శులు, పంపు డ్రైవర్ కమిటీ సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ వారీగా పర్యటనలు నిర్వహించి, వేసవికాలంలో ఎదురయ్యే మంచినీటి ఎద్దడి సమస్యలను ముందుగానే గుర్తించి, సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించి జిల్లా కలెక్టర్ గారికి సమర్పించనున్నట్లు తెలిపారు. వేసవికాలంలో ప్రజలకు నిరంతరంగా తాగునీటి సరఫరా అందించాలంటే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని గౌరవ ఎంపీడీవో జీ. సత్తయ్య ఈ సందర్భంగా సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వేసవి ముందస్తు ప్రణాళికలతో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టంగా పనిచేస్తున్నదని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఇల్లంతకుంట సమ్మక్క సారలమ్మ దర్శనంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్..



**ఇల్లంతకుంట,జనవరి 29 (మన వార్త ప్రతినిధి);**ఇల్లంతకుంట మండల కేంద్రంలోని సమ్మక్క-సారలమ్మల ఆలయంలో గురువారం భక్తి వాతావరణం నెలకొంది. మానకొండూరు మాజీ శాసనసభ్యుడు డాక్టర్ రసమయి బాలకిషన్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సిద్ధ వేణు,మాజీ ప్యాక్స్ అధ్యక్షుడు గొడుగు తిరుపతి,మాజీ ఉపసర్పంచ్ సాదుల్,టౌన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రఘు,కొట్టే వెంకన్న,మహేష్,బొంగోని అనిల్,మామిడి తిరుపతి,నరసయ్య,ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు,అలాగే సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ సభ్యులు ఈదుల రవీందర్ రెడ్డి,గొడుగు తిరుపతి,మల్లేశం,అంతటి సత్యం పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సీఎం కప్ క్రీడలు...



**నార్సింగి జనవరి 29 ( మన వార్త ప్రతినిధి)** నార్సింగ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే సీఎం కప్ 2025 26 సంబంధించిన క్రీడా పోటీలను ఎంపీడీవో ప్రీతి రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు, క్రీడా పోటీలకు హాజరైన అతిథులను విద్యార్థులు మార్చ్ ఫస్ట్ నిర్వహిస్తూ ఘన స్వాగతం పలికారు, వాలీబాల్ క్రీడలు టాస్ వేసి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ తెలిపారు, విద్యార్థులు వేసిన సీఎం కప్పు ముగ్గు వద్ద తహసిల్దార్ గ్రేస్ బాయ్ స్థానిక సర్పంచ్ సుజాత మల్లేశం గౌడ్ మండల విద్యాధికారి గంగాబాయ్ ఉపసర్పంచ్ రాజేందర్ రెడ్డిలు బెలూన్ లు ఎగరవేసి క్రీడలను ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని క్రీడాకారులు స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడానికి క్రీడలు అవసరమని ఎలాంటి గొడవలకు తావివ్వకుండా క్రీడా పోటీలలో పాల్గొనాలని వారు తెలిపారు మండల స్థాయి గెలిచిన క్రీడాకారులను డివిజన్ స్థాయిలో డివిజన్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందని వారన్నారు, జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రథమ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించి రాబోయే ఒలంపిక్ క్రీడలను విద్యార్థులను పంపించడం జరుగుతుందని వారు సూచించారు, ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమని క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గి చదువులో బాగా రాణించడం జరుగుతుందని క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులుగా విద్యార్థులు ముందుకు సాగుతారని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిచంద్రన్, తదితరులు పాల్గొన్నారు

## వల్లంపట్ల మహిళా సంఘ భవానికి భూమి విరాళం..



**ఇల్లంతకుంట,జనవరి 29 (మన వార్త ప్రతినిధి);**ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామంలో మహిళా సంఘాల సమావేశాలకు భవనం లేక మహిళలు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో,గ్రామ పంచాయతీ సర్పంచ్,పాలకవర్గం,మహిళా సంఘాల సభ్యుల కోరిక మేరకు స్వర్గీయ కట్ట సత్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు 2 గుంటల భూమిని మహిళా సంఘ భవన నిర్మాణం కోసం గ్రామ పంచాయతీకి విరాళం అందజేశారు.కుటుంబ సభ్యులు సంపూర్ణ,కట్ట సౌమ్య శ్రీకాంత్ రెడ్డి,రుత్విక్ రెడ్డి భూమిని అందజేశారు.గ్రామస్తులు ఈ ముందడుగు ఎంతో ప్రశంసనీయమని అన్నారు.సర్పంచ్ నేరెళ్ళ విజయ్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు స్థిరమైన భవనం ఏర్పడే విధంగా భూమిని విరాళంగా అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అనంతరం కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి,ఉపసర్పంచ్ వంశీ,నరేందర్,సులోచన,రుచిత,కళ,వెన్నెల,అశోక్,శేఖర్,మధు,నాగరాజు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మకు నిలువెత్తు బంగారం సమర్పించిన మంత్రి

**-మత్స్యగిరీంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి:పొన్నం ప్రభాకర్....**



**శంకరపట్నం:జనవరి29(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం కేశవపట్నం సమ్మక్క-సారలమ్మ జాతరలో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం తులాభారంలో నిలువెత్తు బంగారం (బెల్లం) అమ్మ వార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ,,తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ సమ్మక్క సారలమ్మ దేవతల ఆశీర్వాదం ఉండాలని,ప్రజలంతా సుభిక్షంగా,ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తగట్టు గ్రామంలోని శ్రీ మత్సగిరీంద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి వెంట టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్, సమ్మక్క సారలమ్మ జాతర ఈవో మారుతి రావు,ఉత్సవ కమిటీ చైర్మన్ గుర్రం స్వామి,ఏఎంసి వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, కొత్తగట్టు ఆలయ పాలకవర్గ సభ్యులు,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచ్ లు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో నేటి నుండి టైప్ రైటింగ్ పరీక్షలు



**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జనవరి 29 :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు రాష్ట్ర టెక్నికల్ బోర్డు ద్వారా నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు శుక్రవారం, శనివారం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్ చారి పర్యవేక్షణలో జరుగుతాయని ఆదర్శ టైప్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ మజీద్ గురువారం తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు లోయర్, హయ్యర్ గ్రేడ్ లు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బ్యాచ్ ల వారీగా రెండు రోజులు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, స్కేల్, పెన్ను, ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట తీసుకుని పరీక్ష కేంద్రానికి తమ బ్యాచ్ సమయం కన్నా గంట ముందు హాజరుకావాలని ప్రిన్సిపాల్ మజీద్ తెలిపారు.

## జంగారెడ్డిపల్లెలో క్రికెట్ క్రీడాకారులకు జెర్సీల పంపిణీ..



**ఇల్లంతకుంట,జనవరి 29 (మన వార్తా ప్రతినిధి);**ఇల్లంతకుంట మండలంలోని జంగారెడ్డిపల్లె గ్రామంలో యువత క్రీడల్లో ముందుకు రావాలని గ్రామ ఉపసర్పంచ్ మల్లామారి శ్రీనివాస్ అన్నారు.గ్రామంలోని క్రికెట్ క్రీడాకారులకు ఆయన జెర్సీలు, టీ-షర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచి మార్గాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని,సమాజ సేవలో కూడా తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.క్రీడా పోటీల్లో గ్రామ జట్టు గెలిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.యువతకు జెర్సీలు అందజేసిన ఉపసర్పంచ్ మల్లామారి శ్రీనివాస్‌ను గ్రామ సర్పంచ్ పండుగ సునీత తిరుపతి అభినందించారు.గ్రామస్తులు కూడా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద పెద్ద బాల్ రెడ్డి,తూంకుంట రామలింగారెడ్డి,మంద సత్తిరెడ్డి,మారుపాక తిరుపతి,పసుపునూటి రవి,తడుకపెల్లి తిరుపతి,పండుగ రమేష్,తడుకపెల్లి నర్సింహులు,కుమ్మరవేని యాదగిరి,పండుగ కనుకచంద్రం,పండుగ అర్జున్,మల్లామారి రాజు,గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ అడ్మిషన్లకు ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభం




**-మోడల్ స్కూల్ ప్రిన్స్ పాల్ మాలోత్ సంగీత...**

**బెజ్జంకి జనవరి29(మనవార్త ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని అనుభంద గ్రామమైన ఎల్లంపల్లి గ్రామ తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్‌లో చదవాలనుకునే విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు శుభవార్త.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి అడ్మిషన్ల కోసం ఆన్లైన్ దరఖాస్తులు ఈనెల జనవరి 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ చివరి తేదీ, అప్లై చేసుకున్న విద్యార్థిని విద్యార్థులు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం కూడా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ సూచించారు. ఈ అడ్మిషన్లకు సంబంధించిన ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 19 వ తేదీన 2026 నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అడ్మిషన్ కోసం ఆసక్తి గల విద్యార్థులు https://tgms.telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తెలిపారు.

## 70 రోజుల్లో 2.31 కోట్లు భద్రాచలంలో భక్తుల భక్తికి పెరిగిన హుండీ ఆదాయం

**- వైకుంఠ ఏకాదశి ఉత్సవాల కాలంలో భారీ రద్దీ; సెక్టార్ టికెట్ల ప్రసాదల విక్రయం ద్వారా కూడా ₹60 లక్షలపైగా ఆదాయం...**



**భద్రాచలం, జనవరి 30 (మన వార్త ప్రతినిధి).**దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో భక్తుల హుండీ కానుకల ఆదాయంను గురువారం లెక్కించినారు. ఈ 70 రోజుల ఆదాయం లెక్కించగా రూ. 2 కోట్ల 31 లక్షల 31 వేల 984 (2,31,31,984), బంగారం, 56 గ్రాములు, 1400 గ్రాముల వెండి మరియు ఇంత దేశముల ఇతర దేశముల కరెన్సీ వచ్చినట్లు దేవస్థానం ఈవో శ్రీ కె. దామోదరరావు తెలిపారు.వైకుంఠ ఏకాదశి మహోత్సవాల సందర్భంగా సెక్టార్ దర్శన టికెట్లు మరియు ప్రసాదాల విక్రయం ద్వారా మరో రూ. 60,19,830/- ఆదాయం నమోదైంది. గోదావరి నదీ తీరంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకొని, హుండీలో నాణేలు, నోట్ల రూపంలో తమ భక్తి భావాన్ని అర్పించారు.దేవస్థాన అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించే దృష్ట్యా దర్శనం, వసతి, భోజన వ్యవస్థలను సుసంఘటితంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యాలు మరియు మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం కృషచేయుట జరుగుతుందని ఈవో శ్రీ దామోదరరావు పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు భద్రాచలంలో భవ్యంగా వైబావోపేతంగా జరుగుతాయి.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ ప్రోగ్రాం




**-ముఖ్య వక్తగా హాజరైన లయన్ గంప నాగేశ్వరరావు....**


**గజ్వేల్ జనవరి 29 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ, లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా అధ్యక్షతన విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రముఖ మోటివేషన్ స్పీకర్ లయన్ గంప నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు ఉప్పల మెట్టయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి అధ్యక్షురాలు లయన్ డాక్టర్ శైలజ, డాక్టర్ లింగం లయన్స్ క్లబ్ ప్రముఖులు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా యువతి యువకుల కోసం విద్యార్థుల కోసం వారి భవిష్యత్తు బంగారు మయం కోసం మోటివేషన్ క్లాస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, విద్యార్థులు ఇష్టంతో చదవాలని ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యం దిశగా పయనించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## 4వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా బిజెపి నాయకులు రొట్టెల శ్రీనివాస్ నామినేషన్



**గజ్వేల్ జనవరి 29 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 4వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థిగా రొట్టెల శ్రీనివాస్ నేడు తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి కేవలం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రజలందరికీ తెలుసన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం బిజెపి అభ్యర్థిగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన వార్డు ప్రజలను కోరారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, సీనియర్ నాయకులు గాడిపల్లి భాస్కర్ ఆశీస్సులతో తాను ప్రజల ముందుకు వస్తున్నానని శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని, ప్రజలందరూ తన గెలుపుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ సీనియర్ నాయకులు దేవేందర్, ఎల్లేష్, కృష్ణ, వెంకటయ్య, మల్లేశం, రాజు, కార్తిక్, మధు, బాబు, వినయ్, కార్యకర్తలు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ లో పేరుకుపోయిన చెత్త తొలగింపు



**కొడిమ్యాల, జనవరి 29, మన వార్త.**కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామం లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను గురువారం గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు.డ్రైనేజీ లో చెత్త, మరియు ప్లాస్టిక్ బాటిల్స్ పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న సర్పంచ్ సామంతుల గంగవ్వ-అంజయ్య స్పందించి డ్రైనేజీ శుభ్రం చేపించారు.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా స్థానికులు పలువురు మాట్లాడుతూ, కొండాపూర్ గ్రామం లో పదేపదే డ్రైనేజీ లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త నిలిచిపోతుండడంతో పదేపదే పారిశుధ్య సమస్య తలెత్తుతోందని అంటున్నారు.డ్రైనేజీ చిన్నగా ఉండడంతో చెత్త ఎక్కడికి అక్కడే పేరుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. డ్రైనేజీ పెద్దగా మార్పుచేస్తే ఈ సమస్యకు కొంతవరకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు అంటున్నారు.

## 7 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మనెం శశిధర్ రెడ్డి



**గజ్వేల్ జనవరి 29, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 7 వ వార్డు బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి మనెం శశిధర్ రెడ్డి గురువారం గజ్వేల్ ఐ ఓ సి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని 7 వ వార్డు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు

## 15 వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన నక్క సంతోషి రాములు గౌడ్

**-నక్క సంతోషి రాములు గౌడ్ కు జరుగుతున్న మద్దతు....**

**గజ్వేల్ జనవరి 29 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 15 వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా నక్క సంతోషి రాములు గౌడ్ పోటీ చేస్తున్నారు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వార్డ్ అభివృద్ధి కోసం కౌన్సిలర్ గా పోటీ చేయడానికి మీ ముందుకు వస్తున్నాం అని 15,వ వార్డ్ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు ఏ ఇంటికి వెళ్లిన చేతి గుర్తుకు ఓటు వేస్తామని హామీ ఇస్తున్నారని తెలిపారు ఎల్లవేళలో ప్రజల మధ్యలో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కరిస్తారని అన్నారు



## దివ్యంగుల ఆశ్రమానికి విద్యుత్ దీపాలు అందజేత..

**జమ్మికుంట,జనవరి 29( మన వార్త ప్రతినిధి):** శ్రీ సత్యసాయి బాబా వారి శతాబ్ది మహోత్సవాల సందర్భంగా సత్యసాయి సేవా సమితి బాలవికాస్ పిల్లలు గన్ను సాయి సత్యశ్రీ, సాయి నిత్యశ్రీ లు సాయి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో వెలుతురు కొరకు రూ 4000 విలువ గల మూడు ఎల్ ఈ డి లైట్స్ మరియు వాటికి కావలసిన సామాగ్రిని మరియు పిల్లలకి బిస్కెట్స్, మరియు అరటి పండ్లు ఆశ్రమానికి అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలు మాట్లాడుతూ స్వామివారు చెప్పిన మార్గంలో కోరికలపై అదుపు పాటిస్తూ అలా ప్రోగు చేసిన అమౌంట్ తో సమాజ సేవలో భాగంగా ఈరోజు ఆశ్రమ నిర్వాహకులకు ఎల్ ఈ డి లైట్స్ ని అందజేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని అలాగే వీలైన ప్రతి ఒక్కరూ స్వామి చెప్పిన మార్గంలో నడుచుకుంటూ సమాజ సేవలో పాల్గొని ఆనందాన్ని పొందాలని వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు ఈ కార్యక్రమంలో భాగంగా సత్య సాయి సేవ సమితి జమ్మికుంట కన్వీనర్ గన్ను సతీష్ కుమార్, ప్రియా సాయి, సత్య శ్రీ సాయి, నిత్యశ్రీ మరియు ఆశ్రమ నిర్వాహకులు బుచ్చిరాములు, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.



## నేటితో ముగియనున్న నామినేషన్ ప్రక్రియ...

**-మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్...**

**జమ్మికుంట, జనవరి 29( మన వార్త ప్రతినిధి):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నేడు శుక్రవారం సాయంత్రం 5 గంటలతో నామినేషన్ ప్రక్రియ ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రేపు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ వేసే అభ్యర్థులు పార్టీల ద్వారా గానీ, స్వతంత్ర్య అభ్యర్థులు గానీ ఈ రోజు సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్ వేయాలని అన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత నామినేషన్ తీసుకోవడం కుదరదని తెలిపారు. విధిగా అభ్యర్థులు 5 గంటల లోపే నామినేషన్ కేంద్రానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేయాలని ఆయన పేర్కొన్నారు.




## 19వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన గంగిశెట్టి చెందన రవి

**గజ్వేల్ జనవరి 29, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 19 వ వార్డు బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గంగిశెట్టి చందన రవి గురువారం గజ్వేల్ ఐ ఓ సి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని 19 వ వార్డు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు



## రెండవ రోజు 70 నామినేషన్లు దాఖలు

**-నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్...**

**జహీరాబాద్, జనవరి 29 (మన వార్త):** జహీరాబాద్ మున్సిపల్ 37 వార్డులకు జరుగనున్న వార్డు సభ్యుల ఎన్నికకు ఆయా వార్డుల తరపున గురువారం 70 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు జహీరాబాద్ పురపాలక సంఘం ఎన్నికల అధికారులు తెలిపారు. మొదటి రోజు 4 గురు సభ్యులు, రెండవ రోజు కాంగ్రెస్ పార్టీ నుండి 37, బిఆర్ఎస్ నుండి 19, బిజెపి నుండి 6, సిపిఐయం నుండి ఒకరు, స్వతంత్రులు 6 గురితో కలిపి గురువారం 70 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా ఇప్పటి వరకు మొత్తం 74 మంది నామినేషన్లను ధృవీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ జహీరాబాద్ పురపాలక సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కౌంటర్లను ఆర్డీఓ దేవుజ, మున్సిపల్ కమిషనర్ జైత్ రాం, డిఎస్పీ సైదా నాయక్, సీఐ శివలింగం లతో కలిసి పరిశీలించారు. పట్టణ ఎస్ఐ వినయ్ కుమార్, రూరల్ ఎస్ఐ కాశీనాథ్ లు పోలీసు సిబ్బంది కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



## ఆదర్శంగా నిలిచిన కనగర్తి గ్రామ పంచాయతీ పాలకవర్గం..

**ఇల్లందకుంట, జనవరి 29, (మనవార్త ప్రతినిధి ):** ఇటీవల మరణించిన బండి కొమురయ్య కుటుంబానికి గ్రామ పంచాయితీ పాలక వర్గం 1క్వింటా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామంచ సంపత్, ఉపసర్పంచ్ వట్టేపెల్లి శరత్ చంద్ర,వార్డు సభ్యులు మాడుగుల శ్రీలత-రాజు, కలకోట సమ్మయ్య,అకెనపెల్లీ వెంకటేష్,రామంచ స్వప్న- చంటి,రామంచ రాకేష్,బండి రాజు,బచ్చల సుమలత - భానుచందర్,బచ్చల మౌనిక - సతీష్,దేవునూరి రాజు,పాల్గొని రాబోయే రోజులలో గ్రామంలో ఏ కుటుంబం లో వ్యక్తి చనిపోయిన కూడా ఇదేవిధంగా పాలకవర్గం తరపున సహకారం ఉంటుందని తెలిపారు




## పి ఆర్ టి యు క్యాలండర్ ఆవిష్కరణ

**సిద్దిపేట, జనవరి 29, మన వార్త.** సిద్దిపేట పట్టణం లో పి ఆర్ టి యు తెలంగాణ క్యాలెండర్ ను మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం జిల్లా విజిలెన్స్ అధికారులు ఏం డి గౌస్ పాషా, జగదీశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు పి ఆర్ టి యు తెలంగాణ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లో ముందువరసలో ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరకాల శ్రీనివాస్, పి ఆర్ టి యు తెలంగాణ మైనార్టీ విభాగం వైస్ ప్రెసిడెంట్ వట్టిమల్ల పూర్ణచందర్, కళాశాల కోఆర్డినేటర్ ఎన్ రజిత, పాఠశాల కోఆర్డినేటర్ జిశాన్ అహ్మద్, జూనియర్ లెక్చరర్స్ మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.





## రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ...

**-ముస్తాబాద్ తాసిల్దార్ రామచందర్...**

**-ముస్తాబాద్ మండలం లోని అన్ని గ్రామాల సర్పంచులు...**

**ముస్తాబాద్, మన వార్త జనవరి 29** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నాడు తహసిల్దార్ రామచందర్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లోని కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోని కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు హాజరై మండల ప్రజా ప్రతినిధులు పలు గ్రామ సర్పంచులు 94 లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్, మండల సర్పంచులు వివిధ గ్రామాల లబ్ధిదారులు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## 4,వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన షరీఫ్

**గజ్వేల్ జనవరి 29, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 4 వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి షరీఫ్ గురువారం గజ్వేల్ ఐ ఓ సి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని 4 వ వార్డు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు



## 6వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బొగ్గుల స్వప్న సురేష్

**గజ్వేల్ జనవరి 29, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 6 వ వార్డు బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బొగ్గుల స్వప్న సురేష్ గురువారం గజ్వేల్ ఐ ఓ సి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని 6 వ వార్డు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు



## వార్డు అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యం

**-కౌన్సిలర్ అభ్యర్థి సంగపురం శిరీష రవి....**

**-1వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సంగపురం శిరీష రవి....**

**గజ్వేల్, జనవరి 29 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున సంగపురం శిరీష రవి గురువారం నాడు గజ్వేల్ పట్టణ కేంద్రంలోని ఐఓసి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తాము పోటీలో ఉన్నట్లు ప్రకటించారు. వార్డులోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. వార్డుపై, వార్డు సమస్యలపై తమకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. గత పదేళ్ల కెసిఆర్ పరిపాలన, రెండేళ్ల కాంగ్రెస్ పరిపాలనలో ఒకటో వార్డు అభివృద్ధికి నోచుకోలేదని, తమను గెలిపిస్తే వార్డును అభివృద్ధి రంగంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. 1వ వార్డు ప్రజలు తమను ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి నర్సింగ్, మైస ప్రభుదాస్, బుడిగే ప్రవీణ్, సంగపురం శేఖర్, దయ్యాల రవి, మైస ప్రవీణ్, దయ్యాల వినయ్, తుడుం శ్రీకాంత్ పోతగల్ల శివకుమార్, ఎర్రవల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.




## 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా చీకోటి అనురాధ శ్రీనివాస్ నామినేషన్

**వేములవాడ జనవరి 29 (మన వార్త )** వేములవాడ మున్సిపాలిటీ 10వ వార్డు అభివృద్ధి ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చీకోటి అనురాధ శ్రీనివాస్ స్వతంత్ర అభ్యర్థిగా తన నామినేషన్ దాఖలు చేశారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓటమి చెందినప్పటికీ, ఆమె ఏనాడూ వార్డు ప్రజలకు దూరం కాకుండా నిత్యం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఓటమిని చవిచూసినా వార్డు అభివృద్ధి కోసం తాను నిరంతరం శ్రమించానని, ప్రజల కోరిక మేరకు ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని, వార్డు ప్రజల ఆశీర్వాదం తనపై ఉండాలని కోరారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో చీకోటి శ్రీనివాస్ తో పాటు వార్డు ప్రజలు, మహిళలు, యువకులు మరియు ఆమె మద్దతుదారులు పాల్గొన్నారు



## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ని అడ్డుకున్న పోలీసులు..

**జమ్మికుంట, జనవరి 29( మన వార్త ప్రతినిధి):** సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి జాతరకు వెళ్తున్న హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కుటుంబాన్ని పోలీసులు అడ్డుకున్నారు. తన స్వగ్రామం లోని వీణవంకలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు గురువారం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న సమయంలో పోలీసులు మోహరించి అడ్డుకున్నారు. ఒక్కసారిగా ఉద్రుత వాతావరణం నెలకొన్నది. ఎలాంటి కారణం చెప్పకుండా జాతరకు వెళ్లనివ్వకపోవడంపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఎందుకు అనుమతించడం లేదని పోలీసులను ప్రశ్నించినప్పటికీ, వారు ససేమిరా వెళ్లనివ్వకపోవడంతో పోలీసుల తీరుకు నిరసనగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారి పై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజల పక్షాన తన పోరాటం ఆగదని, ఈ దమనకాండకు తగిన గుణపాఠం తప్పదని ప్రభుత్వం కు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.



## భక్తులకు త్రాగు నీరు పంపిణి చేస్తున్న రాధా టీఎంటి స్టీల్

**-మేడారం జాతరలో లక్షల భక్తులకు దాహం తీరుస్తున్న రాధా టిఎంటి స్టీల్...**

**తాడ్వాయి జనవరి 29 మనవార్త** ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా పెరుగంచిన మేడారం



సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రాధా టీఎంటి స్టీల్ సంస్థ గత మూడు జాతరల నుంచీ నిరంతరంగా సేవా కార్యక్రమాలు చేస్తుంది. అదే విధముగా జనవరి 24 శనివారం రోజు నుండి జనవరి 29 గురువారం రోజు వరకు రాత్రి,పగలు నిరంతరం జాతర వచ్చిన భక్తులకు వారి సిబ్బందితో ఉచిత మినరల్ వాటర్ పంపిణి చేస్తూ భక్తుల దాహం తీరుస్తుంది. తాత్కాలిక బస్ స్టేషన్ నుండి దాహంతో వస్తున్న రహదారిలోనే మంచి నీళ్లు పంపిణి చేయడంతో భక్తులు మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతల దివేనాలు ఎల్లాప్పుడు రాధా టిఎంటి సంస్థ అభివృద్ధికి ఉండాలని కోరుతున్నారు.

## 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఆర్యన్ కౌశిక్ నామినేషన్ దాఖలు..



**జమ్మికుంట, జనవరి 29( మన వార్త ప్రతినిధి ):** జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా వీద్యోదయ విద్యాసంస్థల అధినేత,ప్రజా సేవకుడు,సీనియర్ నాయకుడు స్వర్గీయ యేబూసి రామస్వామి తనయుడు యేబూసి ఆర్యన్ కౌశిక్ గురువారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవకోసం మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించి గెలుపుకు సహకరించాలని వార్డు ప్రజలను కోరారు. ఆదరించి ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇవ్వండి అని ఆయన ప్రజలను కోరుతున్నారు. వార్డు ప్రజలు ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే, 7వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సుపరిచితుడైన తనను మీ బిడ్డగా ఆదరించి గెలిపిస్తే వార్డు అభివృద్ధి తోపాటు వార్డు ప్రజల సమస్యల పరిష్కారశీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్య తన సమస్య గా భావించి అండగా నిలబడతానని తెలిపారు. ప్రజల విశ్వాసంతో గెలిస్తే నిస్వార్థంగా ప్రజా సేవ చేయడమే నా లక్ష్యమని స్పష్టం చేశారు.

## మైలారం లో నలుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్



**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) జనవరి 29** సిరికొండ మండలం మైలారం గ్రామం శివారులో తేదీ 29.01.2026 నాడు పేకాట ఆడుచున్నారు అనే సమాచారంపై, పేకాట ఆడుచున్న ప్రదేశానికి వెళ్లి అక్కడ పేకాట ఆడుచున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూపాయలు 1810/-, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయనైనది అని సిరికొండ పోలీస్ స్టేషన్ ఎస్సై జె. రామకృష్ణ తెలిపారు.

## పీఎం శ్రీ ఆదర్శ పాఠశాలల్లో మరియు కళాశాలలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం మరియు కౌన్సిలింగ్ కార్యక్రమం



**-ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో...**

**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) జనవరి 29** పీఎం శ్రీ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల సిరికొండ లో ఈరోజు ప్రిన్సిపల్ గడ్డం రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం మరియు కౌన్సిలింగ్ కార్యక్రమం ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీకి చెందిన డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ నుండి డాక్టర్ మావురపు సత్యనారాయణ హెచ్ ఓ డి ఫార్మసిటికల్ కెమిస్ట్రీ డాక్టర్ వాసం చంద్రశేఖర్ అసోసియేట్ ప్రొఫెసర్ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ మరియు డాక్టర్ శరత్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ లో మూడు ఇంటిగ్రేటెడ్ కోర్సులని విద్యార్థులకు అందజేయడం జరుగుతుంది అని వివరించారు. 1.ఫార్మాసిటికల్ కెమిస్ట్రీ 2.ఎంబీఏ మరియు 3.ఎకనామిక్స్ లలో ఇంటర్మీడియట్ పూర్తయిన పిల్లలకి ఇంటిగ్రేటెడ్ కోర్సులని అందిస్తుందని తెలియజేశారు. దీనికి గాను పిల్లలు ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించే CPGCET ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్ తీసుకోవచ్చని తెలిపారు. అంతే కాకుండా ఈ కోర్సు ద్వారా పిల్లలు భవిష్యత్తుని తమకు నచ్చినట్టుగా ఫార్మ ఇండస్ట్రీస్ లో లేదా గవర్నమెంట్ జాబ్స్ లో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలియజేశారు.

## రెండవ రోజు 88 నామినేషన్లు దాఖలు..



**- మొత్తం 99 సేకరణ...**

**జమ్మికుంట, జనవరి 29( మన వార్త ప్రతినిధి):** మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. జమ్మికుంట మున్సిపాలిటి లో 30 వార్డులకు జరుగనున్న వార్డు అభ్యర్థుల ఎన్నికకు ఆయా వార్డుల నుండి గురువారం 88 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ ఆయాజ్ తెలిపారు. మొదటి రోజు 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రెండవ రోజువరకు బిజేపీ 29, బీ ఎస్పి 1, కాంగ్రెస్ 28, బిఆర్ఎస్ 21,ఇతరులు 6, స్వతంత్రులు 14 గురితో కలిపి మొత్తం 99 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల ఆఫీసర్ జితేందర్ రెడ్డి ఎన్నికల వ్యయ పరిశీలకులు మనోహర్ పరిశీలించారు. పట్టణ సీఐ రామకృష్ణ, పోలీసు సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పట్టణ శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం..



**జమ్మికుంట, జనవరి 29( మన వార్త ప్రతినిధి):** పట్టణ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ రామకృష్ణ తెలిపారు. సిఐ వివరాల ప్రకారం జమ్మికుంట మున్సిపాలిటీలో సానిటరీ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న పర్ల మహేష్ కు గురువారం మధ్యాహ్నం ఎండి సల్మాన్ జమ్మికుంట కటిక వాడకు చెందిన ఎండి సల్మాన్ తనకి ఫోన్ చేసి తాను మేకలను మేపుకుంటూ ఆబాది జమ్మికుంట శివారులోని కాకతీయ డిజి స్కూల్ వెనకాల చెరువులో ఒక గుర్తుతెలియని వ్యక్తి సుమారు 35 నుండి 40 సంవత్సరాల వుంటాయని వ్యక్తి బోర్ల పడి ఉండి చనిపోయి ఉన్నాడని ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా చనిపోయి దాదాపు 5 నుండి 6 రోజులు అవుతుందని శవం కుళ్ళిన స్థితిలో ఉందని,గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం లక్ష్యసాధన పట్ల స్పష్టత పెంపొందించాలని ఉద్దేశంతో రోల్ మోడల్ కార్యక్రమం



**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) జనవరి 29** సిరికొండ మండల కేంద్రంలో గల పీ యం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల&కళాశాలలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన పట్ల స్పష్టత పెంపొందించాలనే ఉద్దేశంతో లి"రోల్ మోడల్ కార్యక్రమం"లిను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సమాజంలో ఉన్న గొప్ప వ్యక్తులు, విజేతలు, సేవాభావంతో ముందుకు వచ్చిన ప్రముఖుల జీవితాలను విద్యార్థులకు పరిచయం చేశారు. చిన్న స్థాయి నుండి కష్టపడి, పట్టుదలతో ఎదిగి ఉన్నత స్థానాలకు చేరుకున్న వ్యక్తుల జీవిత ప్రయాణం విద్యార్థులకు ఎంతో ప్రేరణనిచ్చిందని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మార్చి,వారు సరైన దిశలో ముందుకు సాగేందుకు దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విలువాధారిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా రోల్ మోడల్ కార్యక్రమం విద్యార్థులలో నూతన ఆశయాలను రేకెత్తించిందని ప్రిన్సిపాల్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి...




**చిన్న శంకరం పేట జనవరి 29 ( మన వార్త ప్రతినిధి)** చిన్నశంకరంపేట మండలంలోని ధరిపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల పోచయ్య గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో అతని భార్య కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపానికి గురై గుర్తుతెలియని పురుగులమందు తాగగా. కుటుంబ సభ్యులుగాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య యాదమ్మ ఫిర్యాదుతో చిన్నశంకరంపేట ఏఎస్ఐ విఠల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 2 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అత్తెల్లి స్రవంతి వెంకటేశం



**గజ్వేల్ జనవరి 29 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2 వ కౌన్సిలర్ అభ్యర్థిగా అత్తెల్లి స్రవంతి వెంకటేశం నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 వ వార్డ్ కౌన్సిలర్ గా స్వతంత్ర అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నామని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు

## 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కల్పన రవీందర్ రెడ్డి



**గజ్వేల్ జనవరి 29 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కల్పనా రవీందర్ రెడ్డి ( సాయి మానస) గురువారం గజ్వేల్ ఐఓసీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 వ వార్డ్ అభివృద్ధి లక్ష్యం అని ప్రజా సేవ కోసం మీ ముందుకు వస్తున్నామని, 13వ వార్డు ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు

## నేడే పార్టీల అభ్యర్థుల ఖరారు..




**జమ్మికుంట, జనవరి 29( మన వార్త ప్రతినిధి):** మున్సిపాలిటీ ఎన్నికల దృష్ట్యా పార్టీ పిరాయింపు,మారుతున్న కండువాలు. నామినేషన్ల గడువు ముగిస్తుండడం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హుజూరాబాద్ నియోజకవర్గశీలో జంపింగులు మొదలయ్యాయి. పలు వార్డులలో ఆయా పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు కరువయ్యారు. దీనితో ఆశావహులు పార్టీలు మారుతూ కండువాలు మారుస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయంటే హుజూరాబాద్ నియోజకవర్గశీ లో పార్టీల నాయకులలో ఎక్కడలేని సందడి నెలకొంటది. దీనితో పలు పార్టి నాయకులు వారు వీరు అవుతున్నారు. వీరు వారవుతున్నారు. బిజెపి పార్టి నుండి పలువురు నాయకులు బీ ఆర్ ఎస్,కాంగ్రెసు నుండి బీ ఆర్ ఎస్, బీ ఆర్ ఎస్ నుండి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మనుషులు వారే కానీ వారి భుజాలపైన మాత్రం కండువాలు మారుతున్నాయి. మొదటినుంచీ పార్టి వెన్నంటి ఉన్న నాయకులు ఆయా పార్టీల తరుపున కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీకి సిద్ధమవుతున్నారు. కాని పార్టి టికెట్ వస్తదో రాదో అనే డైలమాలో పడుతున్నారు ఆశావహులు. ఎన్నికల సమయంలో పార్టి మారిన వ్యక్తులకు టికెట్ ఇస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనితో పార్టీనే నమ్ముకున్న నాయకులు నిరాశ ఎదురవుతుందని,జండా మోసినోళ్ళకా,జై కొట్టినోళ్ళకా పార్టి టికెట్ లభించేది అని అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

## నిత్యం పుదీనీ నీరు తాగితే లభించే ఆరోగ్యప్రయోజనాలు



**డెస్క్,** నేటి ఆహార అలవాట్లు, ఒత్తిడి జీవనశైలి కారణంగా చాలామందిని జీర్ణక్రియ సమస్యలు వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పుదీనీ నీరు సహజ ఔషధంలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పుదీనీలో ఉండే సహజ తైలాలు జీర్ణక్రియను ఉత్తేజపరచి కడుపులో ఉబ్బరం, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలను తగ్గించడంలో దోహదపడతాయి. భోజనం తరువాత లేదా ఉదయం ఖాళీ కడుపుతో పుదీనీ నీరు తాగితే జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేసి శరీరానికి తేలికపాటి అనుభూతిని ఇస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. – శరీరానికి చల్లదనం, హైడ్రేషన్ పెంపు వేసవికాలంలో శరీరంలో వేడి పెరగడం, నీటి లోపం వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తుంటాయి. ఈ సమయంలో పుదీనీ నీరు శరీరాన్ని చల్లబరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. పుదీనీ నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేషన్‌లో ఉండటమే కాకుండా తాజాదనాన్ని కూడా ఇస్తుంది. రోజంతా అలసటగా అనిపించే వారికి, ఎక్కువసేపు బయట పని చేసే వారికి పుదీనీ నీరు మంచి ఉపశమనంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. నీటితో పోలిస్తే పుదీనీ కలిపిన నీరు తాగాలనే ఆసక్తిని పెంచి, ఎక్కువ నీరు తాగే అలవాటుకు కూడా దోహదపడుతుంది. – బరువు నియంత్రణ, చర్మ ఆరోగ్యానికి మేలు బరువు తగ్గాలనుకునే వారు పుదీనీ నీరును తమ రోజువారీ జీవనశైలిలో భాగం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పుదీనీ నీరు మెటబాలిజాన్ని మెరుగుపరచి కొవ్వు కరిగే ప్రక్రియకు సహకరిస్తుందని చెబుతున్నారు. అదే సమయంలో శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడంలో కూడా ఇది తోడ్పడుతుంది. దీని ప్రభావంతో చర్మం శుభ్రంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణుల అభిప్రాయం. మొటిమలు, చర్మ మంటలు వంటి సమస్యలు తగ్గడంలో కూడా పుదీనీ నీరు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. – తలనొప్పి, నోటి దుర్వాసనకు ఉపశమనంపుదీనీలో ఉండే సహజ సుగంధ గుణాలు తలనొప్పి, మానసిక అలసటను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ఒత్తిడితో వచ్చే తలనొప్పులకు పుదీనీ నీరు ఉపశమనం ఇస్తుందని చెబుతున్నారు. అలాగే నోటి దుర్వాసన సమస్యతో బాధపడేవారికి పుదీనీ నీరు సహజ పరిష్కారంగా నిలుస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను తగ్గించి శ్వాసను తాజాగా ఉంచడంలో ఇది సహాయపడుతుంది. అయితే ఎలాంటి ఆరోగ్య పదార్థమైనా పరిమితిలో తీసుకోవాలని, ఇతర ఆహార అలవాట్లతో సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## రోజూ పాటిస్తే ఆరోగ్యం జీవితం చురుకుగా మారే 5 అలవాట్లు




**డెస్క్,**నీరు శరీరానికి ప్రాణాధారం మన శరీరం సక్రమంగా పనిచేయాలంటే తగినంత నీరు అత్యవసరం. రోజూ సరిపడా నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేషన్‌లో ఉండటమే కాకుండా, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలసట తగ్గి, తలనొప్పులు, కండరాల నొప్పులు వంటి సమస్యలు దూరమవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని విషపదార్థాలు బయటకు వెళ్లి, చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుందని సూచిస్తున్నారు.ప్రాసెస్డ్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌కు బదులుగా తాజా కూరగాయలు, పండ్లు, ఇంటి భోజనాన్ని అలవాటు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తాజా ఆహారం శరీరానికి అవసరమైన పోషకాలను అందించి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణక్రియ సక్రమంగా ఉండేందుకు కూడా తాజా ఆహారం కీలకంగా మారుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే శరీరంతో పాటు మనసు కూడా చురుకుగా ఉంటుందని నిపుణుల అభిప్రాయం. నిద్ర, సానుకూల ఆలోచనలు సంపూర్ణ ఆరోగ్యానికి మార్గం రోజూ సరిపడా నిద్రపోవడం శరీరానికి విశ్రాంతిని ఇస్తుంది. నిద్రలేమి ఉంటే ఒత్తిడి, చిరాకు, ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే సానుకూల ఆలోచనలు, ఆశావహ దృక్పథం మనసును ప్రశాంతంగా ఉంచి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చిన్న అలవాట్లను రోజూ పాటిస్తేనే దీర్ఘకాలిక ఆరోగ్యం సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## సంతోషాన్ని పెంచే ఆహారాలు: డోపమైన్‌ను సహజంగా పెంచే పదార్థాలు




**డెస్క్,** మనసుకు ఆనందం, ఉత్సాహం, ప్రేరణ కలిగించడంలో డోపమైన్ అనే రసాయనం కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజువారీ ఒత్తిడి, నిద్రలేమి, అసమతుల్య ఆహారం కారణంగా డోపమైన్ స్థాయిలు తగ్గితే అలసట, నిరుత్సాహం, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు. మందులకంటే ముందుగా సహజ ఆహారాల ద్వారా డోపమైన్ ఉత్పత్తిని ప్రోత్సహించడం ఆరోగ్యకరమైన మార్గమని నిపుణుల అభిప్రాయం. – పండ్లు, కూరగాయలతో సహజ ప్రోత్సాహం అరటిపండ్లు శరీరానికి అవసరమైన టైరోసిన్‌ను అందించి డోపమైన్ ఉత్పత్తికి తోడ్పడతాయని చెబుతున్నారు. అలాగే అనాస పండు, జామకాయ వంటి పండ్లలో ఉండే విటమిన్లు, ఎంజైములు మనసుకు తాజాదనాన్ని ఇస్తాయి. బీట్‌రూట్‌లోని నైట్రేట్లు మెదడుకు రక్తప్రసరణను మెరుగుపరచి ఏకాగ్రతను పెంచుతాయని నిపుణులు అంటున్నారు. బ్రోకోలీ వంటి ఆకుకూరలు శరీరంలో రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెబుతున్నారు. – పానీయాలు, గింజల ప్రాధాన్యం గ్రీన్ టీ వంటి పానీయాల్లో ఉండే సహజ గుణాలు మనసును ప్రశాంతంగా ఉంచి ఏకాగ్రతను పెంచుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మితంగా కాఫీ తీసుకుంటే ఉత్సాహం పెరిగి పని సామర్థ్యం మెరుగవుతుందని చెబుతున్నారు. జీడిపప్పు వంటి గింజల్లో ఉండే ఖనిజాలు మెదడు పనితీరుకు అవసరమైన పోషకాలను అందించి డోపమైన్ సమతుల్యతకు తోడ్పడతాయని పేర్కొంటున్నారు. చిలగడదుంప వంటి కూరగాయలు శరీరానికి శక్తిని అందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని నిపుణుల అభిప్రాయం. – సమతుల్య ఆహారంతోనే నిజమైన సంతోషం డోపమైన్‌ను పెంచే ఆహారాలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని, సరైన నిద్ర, వ్యాయామం, సానుకూల ఆలోచనలు కూడా అవసరమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఆహారంలో పండ్లు, కూరగాయలు, గింజలను సమతుల్యంగా చేర్చుకుంటే శరీరంతో పాటు మనసు కూడా ఆరోగ్యంగా ఉంటుందని చెబుతున్నారు. సహజ ఆహారాలతో మానసిక ఉల్లాసాన్ని పెంచుకోవడం నేటి జీవనశైలిలో అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## రోగ్యానికి వరంలాంటి మునగ ఆకు



**డెస్క్,** సంప్రదాయ ఆహారంలో మునగ ఆకుల ప్రాధాన్యం తెలుగు రాష్ట్రాల గ్రామీణ వంటకాల్లో మునగ ఆకు ఒక అనివార్యమైన భాగంగా కొనసాగుతోంది. తాతలు×టమ్మమ్మల కాలం నుంచే మునగ ఆకును ఆరోగ్యకరమైన ఆహారంగా వినియోగిస్తున్నారు. కూరలు, పప్పులు, చట్నీలు, పొడి రూపంలో మునగ ఆకు ఉపయోగంలో ఉంది. ఆధునిక కాలంలోనూ ఈ ఆకుపచ్చ ఆకుకూరపై వైద్యులు, పోషకాహార నిపుణులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సహజంగా లభించే ఈ ఆకు అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉందని వారు చెబుతున్నారు. – పోషక విలువల గనిగా మునగ ఆకు మునగ ఆకులో విటమిన్–ఏ, విటమిన్–సి, విటమిన్–ఇ, కాల్షియం, ఐరన్, ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా రక్తహీనతతో బాధపడేవారికి మునగ ఆకు ఎంతో మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులకు అవసరమైన పోషకాలు ఇందులో అధికంగా ఉండటంతో దీన్ని తరచుగా ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా మునగ ఆకు కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. – జీర్ణక్రియ, షుగర్ నియంత్రణకు తోడ్పాటు మునగ ఆకు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గడంలో ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అలాగే మునగ ఆకు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందుకే షుగర్ సమస్య ఉన్నవారు మునగ ఆకును పరిమితంగా, వైద్యుల సలహాతో తీసుకోవాలని సూచిస్తున్నారు. – ఎముకలు, చర్మ ఆరోగ్యానికి మేలు కాల్షియం అధికంగా ఉండటంతో మునగ ఆకు ఎముకలను బలపరచడంలో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కీళ్ల నొప్పులు, ఎముకల బలహీనత ఉన్నవారికి ఇది సహజ పరిష్కారంగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు, మునగ ఆకులోని యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో, చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయని చెబుతున్నారు. అయితే అన్ని మంచి గుణాలున్నప్పటికీ, మునగ ఆకును అతిగా తీసుకోవడం మంచిది కాదని, సమతుల్య ఆహారంలో భాగంగా పరిమితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## భారత్ యాత్ర కార్డు వచ్చేసింది...




**న్యూఢిల్లీ** దేశవ్యాప్తంగా ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే కొత్త భారత్ యాత్ర కార్డు అందుబాటులోకి వచ్చింది. ఇకపై భూగర్భ రైలు, రోడ్డు రవాణా సంస్థ బస్సులు, రైలు సేవల కోసం వేరువేరుగా టికెట్లు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా ఒకే కార్డుతో చెల్లింపులు చేయవచ్చు. ఈ కార్డు ద్వారా సమయం ఆదా అవడంతో పాటు ప్రయాణం మరింత సులభంగా మారనుంది. దేశీయ చెల్లింపు విధానం ఆధారంగా రూపొందించిన ఈ కార్డు పర్యాటకులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డుతో స్పర్శలేని చెల్లింపులు చేయవచ్చు. కేవలం యంత్రానికి దగ్గరగా చూపితే చార్జీలు స్వయంచాలకంగా కట్ అవుతాయి. కార్డును సులభంగా రీచార్జ్ చేసుకునే అవకాశం ఉంది. గరిష్టంగా 2000 వరకు మొత్తాన్ని నిల్వ చేసుకోవచ్చు. ఈ కార్డు వినియోగానికి ఎలాంటి గుర్తింపు ధృవీకరణ అవసరం లేదు. మొబైల్ సంఖ్య మరియు సంకేత చిత్ర ఆధారంగా కార్డును సక్రియం చేసుకోవచ్చు. ఈ కార్డును ఇంటి వద్దకే ఆర్డర్ చేసుకునే సదుపాయం ఉంది. 50 ఫీజుతో ఆర్డర్ చేయగానే కొద్ది నిమిషాల్లోనే కార్డు అందుతుంది. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో అన్ని నగరాలకు విస్తరించనున్నట్లు సమాచారం. కార్డు అందిన తర్వాత ప్రత్యేక అనువర్తనం ద్వారా కార్డు వెనుక ఉన్న సంకేత చిత్రాన్ని పరిశీలించి సక్రియం చేసుకోవాలి. ఈ విధంగా ఒకే కార్డుతో అన్ని ప్రయాణ సేవలు పొందే అవకాశం రావడంతో ప్రయాణికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## రూ.500 ఇస్తే చిల్లర వర్షమే ఏటీఎంలోనే 10, 20 నోట్లు..!



**హైదరాబాద్** రోజూ ఎదురయ్యే పెద్ద సమస్య చిల్లర లేమి. జేబులో రూ.500 నోటు ఉన్నా టీ కొనాలన్నా, ఆటో చార్జీ ఇవ్వాలన్నా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంకు కలిసి కొత్త తరహా ఏటీఎంలను ప్రవేశపెట్టాయి. ఇకపై ఈ యంత్రాల్లో పెద్ద నోటు ఇస్తే అవసరమైన చిన్న నోట్లు వెంటనే లభించనున్నాయి. ఈ కొత్త యంత్రాల్లో రూ.10, రూ.20, రూ.50 నోట్లు ప్రత్యేకంగా నిల్వ ఉంటాయి. రోజువారీ అవసరాల కోసం చిన్న మొత్తంలో నగదును తీసుకునే సౌకర్యం ఉంటుంది. అలాగే మీ వద్ద ఉన్న రూ.500 నోటును యంత్రంలో ఉంచితే అది అవసరమైన చిల్లర నోట్లుగా మారి బయటకు వస్తుంది. దీనివల్ల మార్కెట్లు, బస్సు ప్రయాణాలు, చిన్న దుకాణాల్లో చిల్లర కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. ఈ ప్రయోగాన్ని మొదట ముంబై నగరంలో ప్రారంభించారు. రైల్వే స్టేషన్లు, బస్ నిలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, రద్దీ మార్కెట్లలో ఈ యంత్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ మంచి ఫలితాలు వస్తే దేశవ్యాప్తంగా విస్తరించనున్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటికీ నగదు వినియోగం ఎక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం సామాన్యులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇకపై చిల్లర కోసం టెన్షన్ అవసరం లేకుండా ఏటీఎంలోనే సులభంగా పరిష్కారం దొరకనుంది.

## రైల్వే టికెట్లపై 50 వరకు రాయితీ వృద్ధులకు పండుగే..!



**ఢిల్లీ** ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో వృద్ధులకు భారీ ఊరట కలిగించే కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. రైళ్లలో ప్రయాణించే వృద్ధులకు టికెట్ ధరలపై మళ్లీ రాయితీ అమలు చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నేళ్లుగా ఈ సౌకర్యం అమలులో ఉండగా 2020లో మహమ్మారి సమయంలో తాత్కాలికంగా నిలిపివేశారు. ఇప్పుడు రైల్వే సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో ఈ రాయితీని తిరిగి ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది. ఈ నిర్ణయం అమలైతే 60 ఏళు పైబడిన పురుషులకు టికెట్ ధరపై 40 వరకు, 58 ఏళ్లు దాటిన మహిళలకు 50 వరకు తగ్గింపు లభించనుంది. స్లీపర్ తరగతి నుంచి ఎయిర్ కండిషన్ తరగతి వరకు అన్ని తరగతుల టికెట్లపై ఈ రాయితీ వర్తించే అవకాశం ఉంది. కౌంటర్లలోనే కాకుండా ఆన్‌లైన్ టికెట్ సేవ ద్వారా బుక్ చేసిన టికెట్లకూ ఈ సౌకర్యం అందనుంది. మహమ్మారి సమయంలో రైల్వేకు భారీ నష్టాలు రావడంతో అప్పట్లో ఈ రాయితీని నిలిపివేయగా, ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య పెరగడం, ఆదాయం మెరుగుపడటంతో మళ్లీ అమలు చేయడానికి కేంద్రం సానుకూలంగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నిర్ణయం అమలైతే దేశవ్యాప్తంగా వృద్ధులకు ప్రయాణ ఖర్చులు గణనీయంగా తగ్గి, కుటుంబ సభ్యులను కలవడం, తీర్థయాత్రలు చేయడం మరింత సులభమవుతుందని అంచనా వేస్తున్నారు.

## పవర్ బ్యాంక్‌కు గుడ్‌బై భారీ బ్యాటరీతో సూపర్ ఫోన్ దుమ్మురేపుతోంది..!




**హైదరాబాద్** భారీ బ్యాటరీ సామర్థ్యంతో కొత్త తరం మొబైల్ మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తోంది. సాధారణంగా ల్యాప్‌టాప్‌లలో కనిపించే స్థాయి శక్తిని ఇప్పుడు చేతిలో పట్టుకునే మొబైల్‌లో అందుబాటులోకి తెచ్చారు. ఒకసారి పూర్తిగా చార్జ్ చేస్తే రోజుల తరబడి ఉపయోగించుకునే విధంగా ఈ ఫోన్ రూపొందించారు. పవర్ బ్యాంక్ అవసరం లేకుండా ప్రయాణాల్లో, కార్యాలయాల్లో, వినోద వినియోగంలో నిరంతరంగా పనిచేసే సామర్థ్యం దీని ప్రధాన ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ మొబైల్‌లో 10001 సామర్థ్యం గల భారీ బ్యాటరీ అమర్చారు. దీని వల్ల వీడియోలు చూడటం, ఆటలు ఆడటం, ఆన్‌లైన్ పనులు చేయటం వంటి అన్ని కార్యకలాపాలు దీర్ఘకాలం నిరభ్యంతరంగా కొనసాగించవచ్చు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మూడు వేర్వేరు మెమరీ, నిల్వ ఎంపికలతో ఈ ఫోన్ అందుబాటులోకి వస్తోంది. ప్రారంభ ధరను 23999గా నిర్ణయించారు. ఫిబ్రవరి 5 నుంచి ప్రముఖ ఆన్‌లైన్ వేదికలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. మధ్యతరగతి వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఆకర్షణీయమైన రూపకల్పన, బలమైన పనితీరు, దీర్ఘకాలిక బ్యాటరీ శక్తితో ఈ మొబైల్ విడుదలైంది. బ్యాటరీ త్వరగా అయిపోతుందనే టెన్షన్ లేకుండా నిరంతర వినియోగం కోరుకునే వారికి ఇది సరైన ఎంపికగా మారనుంది.

## మెల్లకన్ను బాధే బలంగా మారిందా హృదయాన్ని తాకుతున్న 'శ్రీ చిదంబరం గారు' ట్రైలర్..!




**హైదరాబాద్** టాలీవుడ్ నుంచి మరో వినూత్న కథాంశంతో రూపొందిన చిత్రం 'శ్రీ చిదంబరం గారు' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సాధారణంగా సినిమాల్లో శారీరక లోపాలను కేవలం హాస్యం కోసమే చూపిస్తారు. కానీ ఈ చిత్రంలో మాత్రం మెల్లకన్ను ఉన్న ఒక యువకుడు సమాజంలో ఎదుర్కొనే అవమానాలు, అతనిలో పెరిగే అనిశ్చిత భావాలు, ప్రేమలో ఎదురయ్యే అంతర్గత సంఘర్షణలను చాలా హృద్యంగా చూపించారు. దర్శకుడు వినయ్ రత్నం ఈ కథను భావోద్వేగంగా మలిచారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా ఆవిష్కరించి చిత్ర బృందాన్ని అభినందించారు. మెల్లకన్ను కారణంగా తన లోపాన్ని దాచుకోవడానికి ఎప్పుడూ కళ్లద్దాలు ధరించే కథానాయకుడు, ప్రేమలో పడిన తర్వాత తన బలహీనతను ఎలా అధిగమిస్తాడనే అంశమే కథలో ప్రధానంగా ఉంటుంది. హీరో వంశీ తుమ్మల ఈ పాత్ర కోసం ప్రత్యేకమైన నడవడికలు, హావభావాలతో కష్టపడ్డారు. హీరోయిన్‌గా సంధ్యా వశిష్ట సహజ నటనతో ఆకట్టుకుంది. ఈ సినిమా నేటి యువతకు తమ లోపాలను దాచుకోవడం కాదు, వాటినే బలంగా మార్చుకోవాలని చెప్పే స్ఫూర్తిదాయక ప్రయత్నమని బుచ్చిబాబు ప్రశంసించారు. చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి చందు రవి సంగీతం అందించారు. ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి ఒక పాట ఆలపించడం విశేషంగా నిలిచింది. గ్రామీణ ప్రేమకథగా రూపొందిన ఈ సినిమా "నీ లోపమే నీ బలం" అనే సందేశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భావోద్వేగం, ప్రేమ, ఆత్మవిశ్వాసం మేళవించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకులను అలరించనుంది.

## ఓటీటీలోకి దూసుకొచ్చిన వరుణ్ సందేశ్ కానిస్టేబుల్




**హైదరాబాద్** యంగ్ హీరో వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో నటించిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ కానిస్టేబుల్ ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. గత ఏడాది అక్టోబరులో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తాజాగా ప్రముఖ ఓటీటీ వేదికలో స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిశ్రమ స్పందన పొందినప్పటికీ, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నంలో ఉంది. ఈ సినిమా కథ శంకరపల్లి అనే గ్రామం చుట్టూ తిరుగుతుంది. వరుస హత్యలు ఆ గ్రామాన్ని వణికిస్తుంటాయి. అదే సమయంలో అక్కడ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాశీ మేనకోడలు కూడా దారుణ హత్యకు గురవుతుంది. సొంత మనిషిని కోల్పోయిన బాధతో కాశీ ఆ హంతకుడిని పట్టుకోవాలని పట్టుదలగా ముందుకు సాగుతాడు. సీరియల్ కిల్లర్ వెనుక ఉన్న అసలు రహస్యాలు ఏమిటి, అతడిని కాశీ ఎలా పట్టుకున్నాడు అనే అంశాలు ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతాయి. లవర్ బాయ్ ఇమేజ్‌తో గుర్తింపు తెచ్చుకున్న వరుణ్ సందేశ్ ఈ సినిమాలో సీరియస్ పోలీస్ పాత్రలో కనిపించడం విశేషం. ఆయన నటనకు మంచి మార్కులు పడుతున్నాయి. కథానాయికగా మధులిక వారణాసి నటించగా, మురళీధర్ గౌడ్, రవివర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థ్రిల్లర్ ప్రేమికులకు మంచి ట్రీట్‌గా మారుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## ప్రపంచకప్‌కు 3 రోజులు ముందు సుందర్‌కు దేహసామర్థ్య పరీక్ష జట్టులో ఉత్కంఠ..!



**ముంబయి** ప్రపంచకప్ 2026కు ముందు భారత జట్టులో ఆందోళన నెలకొంది. స్టార్ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ టోర్నీలో ఆడగలడా లేదా అన్న సందేహాలు కొనసాగుతున్నాయి. గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతని దేహసామర్థ్యాన్ని నిర్ధారించేందుకు 4న బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి శిక్షణ కేంద్రంలో కీలక పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 11న న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో సుందర్ పక్కటెముకల వద్ద గాయపడిన సంగతి తెలిసిందే. ఊహించినదానికంటే కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతోంది. అధికారిక వైద్య నివేదిక వచ్చేవరకు ఎలాంటి ప్రత్యామ్నాయాన్ని ప్రకటించవద్దని సెలక్టర్లు నిర్ణయించారు. నిబంధనల ప్రకారం 30లోపు జట్లలో మార్పులు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ గాయం కారణంగా అవసరమైతే టోర్నీ మధ్యలో కూడా మార్పులు చేసుకునే వీలు ఉంటుంది. భారత జట్టు 3న ముంబయిలో సమావేశమై 4న దక్షిణాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. అదే రోజు సుందర్‌కు దేహసామర్థ్య పరీక్ష జరగనుండటంతో ఈ నిర్ణయం మరింత కీలకంగా మారింది. వైద్య వర్గాల సమాచారం ప్రకారం పక్కటెముకల దగ్గర కండరాల్లో చీలిక ఏర్పడినట్టు తెలుస్తోంది. పూర్తిగా కోలుకున్న తర్వాతే అతను మైదానంలోకి రావాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ సుందర్ అందుబాటులోకి రాకపోతే అతని స్థానంలో రియాన్ పరాగ్‌ను ప్రధాన ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అక్షర్ పటేల్ జట్టులో ఉండటంతో జట్టు సమతుల్యత బాగానే ఉందని భావిస్తున్నారు. సుందర్ చివరి దశలోనైనా అందుబాటులోకి వస్తాడన్న ఆశతో అతని కోసం వేచి చూసే అవకాశమూ ఉన్నట్టు తెలుస్తోంది.

## ఏపీ కేబినెట్ తీపికబురు జ్యోతి యర్రాజీ కళ్లలో ఆనందం!!




**అమరావతి** అర్జున అవార్డు విజేత అథ్లెట్ జ్యోతి యర్రాజీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ గౌరవం కల్పించింది. విశాఖలో 500 చదరపు గజాల స్థలం కేటాయించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. అంతేకాదు జ్యోతి డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ఆమెకు గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలన్న ప్రతిపాదనకూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ శుభవార్తపై జ్యోతి యర్రాజీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2025లో ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో జ్యోతి స్వర్ణ పతకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆమె అద్భుత విజయానికి మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలియజేస్తూ ఆర్థిక సహాయం కూడా అందించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. జ్యోతి వంటి ప్రతిభావంతుల విజయాలు రాష్ట్ర యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.